క్లుప్తంగా

బ్యానర్ తొలగింపు



సాక్షి ఎఫెక్ట్

అడ్డాడ(పామర్రు): ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా మండలంలోని అడ్డాడ గ్రామంలో ఏర్పాటు చేసిన కూటమి ప్రభుత్వ బ్యానర్‌ను తొలగించాలంటూ ఈ నెల 18వ తేదీన సాక్షి దిన పత్రికలో వచ్చిన కథనానికి గ్రామ కార్యదర్శి పద్మశ్రీ వేణి స్పందించారు. సిబ్బందితో వెళ్లి పామర్రు–గుడివాడ జాతీయ రహదారి పక్కనఉన్న బ్యానర్‌ను తొలగించారు.

వీరాంజనేయస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



పామర్రు: ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. స్వామికి పంచామృతాలతో అభిషేకాలను నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలోనే పాల పొంగళ్ల వండి స్వామికి నివేదనలను సమర్పించి, మొక్కులను తీర్చుకున్నారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు అగ్నిహోత్రం రామాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ప్రసాద్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతిపై శిక్షణ



మండవల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో మంగళవారం ఎంఈఓ రత్నసునాదం, ఐసీడీఎస్ సీడీపీఓ దీప్తి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ప్రీ ప్రైమరీ స్కూల్ల బోధించేందుకు జ్ఞానజ్యోతి 120 రోజుల కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలందరికీ విద్యాశాఖ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం ప్రారంభించామన్నారు. తెలుగు, గణితం బోధనపై శిక్షకులు రూప్‌కుమార్, ప్రసాద్ తదితరులు అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం ప్రసాద్, సూపర్‌వైజర్ నాగలక్ష్మి, ప్రసన్న పాల్గొన్నారు.

మొవ్వలో..

మొవ్వ: అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరు రోజులు పాటు కొనసాగే జ్ఞాన జ్యోతి శిక్షణ తరగతులు మంగళవారం నుంచి మొవ్వలో ప్రారంభమయ్యాయి. పీఎం శ్రీ శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ హైస్కూల్లో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు కోర్సు డైరెక్టర్లుగా ఎంఈఓ–1 శివశంకర్‌రావు, ఎంఈఓ–2 శ్రీలక్ష్మి కొనసాగుతుండగా డీఆర్‌పీలు రోహిణి కుమార్, ఎం.శివకుమార్ శిక్షణను ప్రారంభించారు. సీడీపీఓ సుధారాణి, ఇన్‌చార్జి హెచ్‌ఎం పసుపులేటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనం ఫ్లోరింగ్ పనుల పరిశీలన



మండవల్లి: పెరికెగూడెంలో ఎంపీపీ నిధులు రూ.లక్షతో పెరికెగూడెం అంగన్‌వాడీ భవనం ఫ్లోరింగ్ పనులు చేపట్టారు. సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు, ప్రత్తిపాడు సర్పంచ్ బేతపూడి యేసోబురాజు పర్యవేక్షణలో సర్పంచ్ పెరుమాళ్ల పద్మ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు పెరుమాళ్ల సత్యనారాయణ మంగళవారం ఫ్లోరింగ్ పనులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ ఈ నిధులను మంజూరు చేశారని తెలిపారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ



పమిడిముక్కల: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను గుడివాడ డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ మంగళవారం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీలో భాగంగా స్టేషన్‌ను సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. సీఐ చిట్టిబాబు, ఎస్‌ఐ శ్రీనులను కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. తొలిసారి స్టేషన్‌కు వచ్చిన డీఎస్పీకి సీఐ, ఎస్‌ఐ పూల మొక్కలు అందజేశారు.

అన్నదాతకు అవస్థలు

కూటమి ప్రభుత్వంలో రైతులకు అందని సాయం

కైకలూరు: రైతును రారాజును చేస్తామంటూ కూటమి నాయకులు ఎన్నికల ముందు ప్రగల్భాలు పలికారు. ప్రజాగళం ఉమ్మడి మేనిఫెస్టో–2024లోని సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా ప్రతి రైతుకూ ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం అందిస్తామని నాయకులు ప్రకటించారు. దీంతో రైతులు సంబరపడ్డారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఇచ్చిన హామీలను పక్కన పెట్టేసింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఎనిమిది నెలలు పూర్తవుతున్నా రైతు భరోసా పథకం పేరు మార్పు చేసిన అన్నదాత సుఖీభవ పథకానికి అడుగులు ముందుకు పడటం లేదు.

గతంలో రైతుల బ్యాంకు ఖాతాలకు జమ

కైకలూరు నియోజకవర్గంలో ఆక్వా చెరువులతో పాటు వివిధ పంటలను సాగు చేస్తున్నారు. నియోజకవర్గంలో కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాల్లో మొత్తం 2,31,882 ఎకరాల్లో రైతులు వ్యవసాయం చేస్తున్నారు. ఈ రంగంపై దాదాపు 10,713 మంది రైతు కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్సార్ రైతు భరోసా పథకంలో కైకలూరు మండలంలో రూ.12,75,39,750, కలిదిండి మండలంలో రూ.9,31,91,300, మండవల్లి మండలంలో రూ.13,49,34,550, ముదినేపల్లి మండలంలో రూ.20,27,14,250 వెరసి మొత్తం రూ.55,83,79,850 రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేశారు.



వరి నాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు (ఫైల్)

రైతు భరోసాతో కర్షకులకు ధీమా

దేశంలో ఎక్కడా లేనివిధంగా సొంత భూమి సాగు చేసుకుంటున్న రైతులతో పాటు అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కౌలు రైతులు, అటవీ, దేవదాయ భూములు సాగుచేసుకుంటున్న రైతన్నలకు కూడా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా పథకం అందింది. ఏటా రూ.13,500 బ్యాంకు ఖాతాలకు ఠంచనుగా చెల్లించారు. ఒక పక్క కరోనా కష్టాలు వచ్చినా, ఇచ్చిన మాట ప్రకారం పథకాన్ని గత ప్రభుత్వం అమలు చేసింది. ఇవే కాకుండా గత ప్రభుత్వ ఐకాయిలతో సహా వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు, వైఎస్సార్ ఉచిత పంటల బీమా, ప్రకృతి విపత్తుల వల్ల నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం, ధాన్యం కొనుగోలు, ఉచిత వ్యవసాయ సబ్సిడీ ఇలా అనేక పథకాలను అమలు చేసి అన్నదాతలకు అండగా వైఎస్సార్ సీపీ నిలిచింది.

రెండు పంటలకూ అందని సాయం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన రైతు భరోసా పథకంలో మొదటి విడత ఖరీఫ్ పంట వేసే ముందు మే నెలలో రూ.7,500, రెండో విడత అక్టోబరులో ఖరీఫ్ పంట కోత సమయంలోనూ, ఇంకా రబీ అవసరాల కోసం రూ.4,000, మూడో విడత ధాన్యం ఇంటికి చేరే సంక్రాంతి వేళ, జనవరిలో రూ.2,000 రైతులకు అందించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఖరీఫ్, రబీ రెండు పంటలకూ పెట్టుబడి సాయం అందక రైతులుఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వంలో అనేక ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు విషయంలోనూ రైతులు అవస్థలు ఎదుర్కొన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

రైతులకు ద్రోహం



ఏటా వైఎస్సార్ రైతు భరోసాకు బదులుగా అన్నదాత సుఖీభవ పేరుతో రూ.20 వేల సాయం అందిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి నాయకులు రైతులకు శఠగోపం పెట్టారు. గత ప్రభుత్వ హయాంలో ఏటా రూ.13,500 క్రమం తప్పకుండా పెట్టుబడి సాయం పొందాను. నాకున్న 2.5 ఎకరాల భూమిని ప్రభుత్వం అందించే ఆర్థిక సాయంతో సజావుగా సాగు చేసుకునేవాడిని. ప్రస్తుత ప్రభుత్వం సాయాన్ని ఎగవేసి రైతులకు ద్రోహం చేసింది.

– ఆనందదాసు నాగరాజు, రైతు, చేవూరుపాలెం, ముదినేపల్లి మండలం

తీరని అన్యాయం



రైతు భరోసా మించి సాయం చేస్తామని కూటమి నాయకులు పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఎలాంటి సాయం ఇవ్వలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కౌలు రైతులకు సైతం ఏటా పెట్టుబడి సాయం అందేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.20 వేలు సాయమందిస్తామని చెప్పిన నాయకుల మాటలు నీటిమూటలయ్యాయి.

– నందకిషోర్, రైతు, పెరికెగూడెం, మండవల్లి మండలం

రైతులకు ఐడీ కార్డులు



అన్నదాత సుఖీభవ పథకం అమలు కోసం ప్రభుత్వం ప్రతి రైతుకూ యూనిక్ నంబరుతో కూడిన ఐడీ కార్డులను అందించాలని నిర్ణయించింది. రైతుల వివరాలు సేకరిస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ ద్వారా రూ.6,000 ప్రతి రైతుకూ అందిస్తోంది. త్వరలో పథకాన్ని అమలు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

– ఆర్.దివ్య, వ్యవసాయాధికారి, కైకలూరు

23 నుంచి చెన్నమల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు

తోట్లవల్లూరు: తోట్లవల్లూరులోని శ్రీభ్రమరాంబ చెన్నమల్లికార్జునస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 23 నుంచి మార్చి ఒకటో తేదీ వరకు జరగనున్నాయి. దీనికి సంబంధించి ఆలయ కార్యనిర్వహణాధికారి హరి దుర్గానాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. 23న స్వామి వారిని పెండ్లి కుమారుని చేయుట, అమ్మవారిని పెండ్లి కుమార్తెను చేయుట, రాత్రికి బృంగి వాహనంపై గ్రామోత్సవం, 24న హరి కథా కాలక్షేపం, భరత నాట్య ప్రదర్శన, రాత్రికి గజ వాహనంపై స్వామి వారి ఊరేగింపు నిర్వహించనున్నారు. 25 సాయంత్రం 6 గంటలకు హరి కథా కాలక్షేపం, కూచిపూడి నృత్య ప్రదర్శన, రాత్రికి శేష వాహనంపై స్వామి వారి ఊరేగింపు, 26న మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని వేకువ జాము నుంచే విశేషపూజలు, ఉదయం 10 గంటలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రాత్రి 6.30 గంటలకు జగజ్యోతి, 10 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం ఉంటుంది. అనంతరం నంది వాహనంపై గ్రామోత్సవం, 27న హరి కథా కాలక్షేపం, మురళీ కోలాట ప్రదర్శన, రథోత్సవం నిర్వహిస్తారు. 28న వసంతోత్సవం, వీరభద్ర ఆరాధన, మార్చి ఒకటో తేదీన ద్వాదశ ప్రదక్షిణలు, స్వామి వారి పవళింపు సేవ, మధ్యాహ్నం 12 గంటలకు అన్నసమారాధనతో కార్యక్రమాలు ముగియనున్నాయి.



తోట్లవల్లూరు శివాలయం

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ముదినేపల్లి రూరల్ : బాలికలు, మహిళలపై జరుగుతున్న నేరాలతో పాటు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ వీరభద్రరావు అన్నారు. మండలంలోని గురజ, వడాలి జెడ్పీ హైస్కూళ్లతో పాటు ముదినేపల్లి సహాయమాత హైస్కూల్ విద్యార్థినులకు అభయ వాహనం ద్వారా నేరాలపై అవగాహన సదస్సులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులతో ఫోన్లో మాట్లాడడం, చాటింగ్ చేయడం వంటి కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. ఏఎస్‌ఐ పద్మజ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

21 నుంచి సబ్‌జోన్ ఆటల పోటీలు

ముదినేపల్లి రూరల్: నియోజకవర్గస్థాయి సబ్‌జోన్ ఆటల పోటీలు ఈ నెల 21, 22వ తేదీల్లో నిర్వహించనున్నట్టు స్థానిక జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వై విజయకుమార్, పీడీలు కె రోజా, పి శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఈ మేరకు డీఈఓ ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. ఈ నెల 21న స్థానిక జెడ్పీ హైస్కూల్లో బాలికలకు, 22న ఆరుతెగలపాడు జెడ్పీ హైస్కూల్లో బాలురకు ఆటల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: నియోజకవర్గ స్థాయి బాలబాలికల సబ్‌జోన్ ఆటల పోటీలు ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆ పోటీల నిర్వాహక అధ్యక్ష, కార్యదర్శులు బి.వేణుబాబు, పి.లూయిస్ మంగళవారం తెలిపారు. ఈ నెల 21న బాలికలకు ముదినేపల్లి జిల్లా పరిషత్ స్కూల్, 22న బాలురకు కలిదిండి మండలం ఆరుతెగళపాడు జెడ్పీ స్కూల్లో పోటీలు ఉదయం ఎనిమిది నుంచి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. జోన్ పరిధిలోని పీడీ, పీఈటీలు 97018 34513లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ముగిసిన ప్రాక్టికల్ పరీక్షలు

మొవ్వ: ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభమైన ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. స్థానిక క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం ఎంపీసీ 32, బైపీసీలో 31 మంది విద్యార్థులు ఈ పరీక్షల్లో పాల్గొన్నారు. ఘంటసాల జెడ్పీ హైస్కూల్ ప్లస్–2 విద్యార్థినులు కూడా ఈ కేంద్రానికి హాజరయ్యారు. ఈ పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డి.సుధాకర్ వ్యవహరించారు.



ప్రాక్టికల్ పరీక్షల్లో విద్యార్థులు

బాలికను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

పామర్రు: ఓ వ్యక్తి తన కుమార్తె వెంట పడుతూ వేధిస్తున్నాడనే విషయమై పామర్రు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. పెదమద్దాలి గ్రామానికి చెందిన లంకా నాంచారమ్మకు 17 ఏళ్ల కుమార్తె ఉంది. ఈమె పామర్రు గఫార్ సెంటర్‌లోని ఓ దుకాణంలో పని చేస్తోంది. ఈ నేపథ్యంలో స్థానికుడు రుంజుల వేణు అనే అతను ఆ దుకాణం వద్దకు వచ్చి రోజూ తన కుమార్తెను పెళ్లి చేసుకుంటావా అంటూ వెంట పడుతూ వేధిస్తున్నాడు. దీంతో నాంచారమ్మ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంబంధిత వ్యక్తిపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు.

పట్టభద్రుల ఎన్నికలకు ఏర్పాట్లు

గుడ్లవల్లేరు: కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలు ఈ నెల 27వ తేదీన జరగనున్నాయి. ఈ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను చేస్తున్నామని తహసీల్దార్ బి.లోకరాజు మంగళవారం తెలిపారు. గుడ్లవల్లేరు మండలంలో 1,483 పట్టభద్రులకు సంబంధించిన ఓట్లు ఉన్నాయన్నారు. ఓటర్లకు అవగాహన కల్పించే కార్యక్రమాలను చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఓటర్ల స్లిప్పులను బీఎల్‌ఓల ద్వారా అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ నెల 27న జరిగే ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు.

ఎన్నికల కోడ్ అమలు ఎక్కడ?

పామర్రు: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పామర్రులో ఎన్నికల కోడ్ అమల్లో ఉందా లేదా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. గ్రామంలో చాలా చోట్ల కూటమి ప్రభుత్వ, జనసేన బ్యానర్లు కాకుండా ఆ పార్టీలకు సంబంధించిన జెండాలు కూడా దర్శనమిస్తున్నాయి. అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైఎస్సార్ సీపీ బ్యానర్లు, జెండా దిమ్మలకు మాత్రం ముసుగులు వేసిన అధికారులకు కూటమి ప్రభుత్వ బ్యానర్లు, జెండా దిమ్మలు కనబడ లేదా అని ప్రశ్నిస్తున్నారు. పామర్రు కూడలి నుంచి మచిలీపట్నం వైపు వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఎన్టీఆర్ కాలనీ వద్ద టీడీపీ దిమ్మపై జెండా ఉంది. సంబంధిత అధికారులు స్పందించి ఎన్నికల కోడ్‌ను అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



బందరు రోడ్డులో ఎన్టీఆర్ కాలనీ వద్ద ఎగురుతున్న టీడీపీ జెండా

కరాటే పోటీల్లో గౌతమ్ విద్యార్థి ప్రతిభ

గుడివాడ టౌన్: సలంబం ఫెడరేషన్ నిర్వహించిన కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో తమ విద్యార్థి బి.కార్తికేయ ప్రతిభను ప్రదర్శించి ద్వితీయ స్థానం సాధించారని గౌతమ్ స్కూల్ ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. మంగళవారం పాఠశాల్లో కార్తికేయను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 30వ తేదీ నుంచి ఈ నెల 2వ తేదీ వరకు తమిళనాడులోని కన్యాకుమారిలో జరిగిన ఆల్ ఇండియా సలంబం ఫెడరేషన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో తమ విద్యార్థి విజయం సాధించాడని తెలిపారు. కార్తికేయ, కోచ్ వెంకటేశ్వరరావును పాఠశాల ప్రిన్సిపాల్స్ పి. సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి అభినందించారు.



విజయం సాధించిన విద్యార్థితో ప్రిన్సిపాల్ తదితరులు

వ్యక్తిపై దాడి

ముదినేపల్లి రూరల్: ఇంటి ముందు నిలిపిన ఆటోను తీయమని చెప్పినందుకు వ్యక్తిపై దాడి చేసిన ఘటన మండలంలోని పేరూరులో సోమవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు గ్రామానికి చెందిన బొర్రా మనోగంధి ఇంటి ముందు కారు పెట్టుకునే స్థలంలో ఉన్న ఆటోను పక్కకు తీయమని అందులోని వ్యక్తులను అడిగాడు. దీంతో ఏడుకొండలు, హరీష్, ఉదయకుమార్ ఆగ్రహంతో ఆటోలో నుంచి కిందికి దిగి కర్రలతో దాడి చేసినట్లు మనోగంధి ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేపట్టి నిందితులను మంగళవారం అరెస్టు చేసి కైకలూరు కోర్టుకు పంపినట్లు ఎస్‌ఐ వీరభద్రరావు తెలిపారు.

అన్నసమారాధన

గుడివాడ టౌన్: స్థానిక నాగవరప్పాడు రోడ్డులోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం భారీ అన్నసమారాధన జరిగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి మూడో మంగళవారం ఈ ఆలయంలో అన్నసమారాధన నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొలుసు కృష్ణారావు, యాదవ సంఘం అధ్యక్షుడు వీర్ల వెంకటేశ్వరరావు, సభ్యులు లోయ శివాజీ, జోగా బాలకృష్ణ, పల్లెబాట రాజా పాల్గొన్నారు.

అక్కినేని కళా కేంద్రంలో..

నందివాడ: ప్రముఖ సినీ నటుడు, స్వర్గీయ అక్కినేని నాగేశ్వరరావు పెళ్లి రోజు సందర్భంగా ఆయన స్వగ్రామమైన వెంకట రాఘవపురం అక్కినేని కళా కేంద్రంలో మంగళవారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమం మెరుగుమాల లక్ష్మణరావు, రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో అక్కినేని అభిమానులు పాల్గొన్నారు.

జాతీయ కబడ్డీ పోటీల రిఫరీగా ఏసురత్నం

గుడివాడ టౌన్: జాతీయ కబడ్డీ పోటీల రిఫరీగా వెన్ననపూడి జెడ్పీ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు పరిశె ఏసురత్నం ఎంపికైనట్లు మంగళవారం తెలిపారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ వై. శ్రీకాంత్ సమాచారం ఇచ్చినట్లు ఏసురత్నం పేర్కొన్నారు. ఒడిశాలో ఈ నెల 20 నుంచి జరగనున్న జాతీయ స్థాయి పురుషుల కబడ్డీ పోటీలో ఈయన న్యాయనిర్ణేతగా ఉంటారని పేర్కొన్నారు.



ఏసురత్నం

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు చేయించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి అనేక మంది భక్తులు ఆలయానికి చేరుకున్నారు. స్వామివారి పుట్టలో పాలు పోసి, నాగబంధాల వద్ద పూజలు చేసి అభిషేకాలు చేయించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా నిత్యాన్నదానానికి సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈఓ ఆర్ గంగాశ్రీదేవి పర్యవేక్షించారు.

ఘనంగా పీటీపీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

పామర్రు: పామర్రు టౌన్ పాస్టర్ల ఫెడరేషన్(పీటీపీఎఫ్) ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక చాట్లవానిపురంలోని ఫెడరేషన్ కార్యాలయంలో నిర్వహించిన సభకు సాల్మన్ కొల్లాబత్తుల అధ్యక్షత వహించారు. ప్రముఖ లాయర్ అవుల ప్రవీణ్ మాట్లాడుతూ ఫెడరేషన్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. అనంతరం పీటీపీఎఫ్ సభ్యులు ముఖ్య అతిథులను సన్మానించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పామర్రు: 132 కేవీ పామర్రు సబ్‌స్టేషన్ పరిధిలో సాంకేతిక మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం ఆరు నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.కోటేశ్వరరావు మంగళవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ పనుల కారణంగా బుధవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఈఈ జీబీ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక చౌదరిపేటలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

రక్తదానం

గుడివాడ టౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జానకి అనే మహిళకు ఆపరేషన్ కోసం రక్తం అవసరం కాగా ఆర్‌కే వారియర్స్ సభ్యుడు విశ్వేశ్వరరావు మంగళవారం రక్తదానం చేశారు. ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి, వారికి ప్రాణదాతలుగా నిలవాలని ఆర్‌కే వారియర్స్ ఫౌండర్ రామకృష్ణ పేర్కొన్నారు.

లయన్స్ చైర్మన్‌కు అవార్డు



గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో పేదలు, ప్రభుత్వ పాఠశాలలు, గవర్నమెంట్ హాస్టల్స్ విద్యార్థులకు ముమ్మరంగా నిర్వహిస్తున్న ఉచిత నేత్ర వైద్య పరీక్షల శిబిరాలను కొనియాడుతూ లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళకు జిల్లా స్థాయి ఉత్తమ అవార్డును అందజేశారు. ఈ అవార్డును విజయవాడలో మంగళవారం శశికళకు జిల్లా లయన్స్ గవర్నర్ గద్దె శేషగిరి చేతుల మీదుగా అందజేశారు.

గుడివాడ డీవైఈఓగా రవికుమార్



గుడివాడ టౌన్: గుడివాడ డీవైఈఓగా కొండ రవికుమార్ బాధ్యతలు స్వీకరించారు. గన్నవరం ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్న రవికుమార్ గుడివాడ డివిజన్ ఉప విద్యాశాఖాధికారిగా నియమితులయ్యారు. పూర్తి అదనపు బాధ్యతలతో ఆయన ఈ విధులు నిర్వహిస్తారని అధికారిక ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం స్థానిక కాకర్ల వీధిలోని డీవైఈఓ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం డీవైఈఓగా విధులు నిర్వహిస్తున్న ఐ.పద్మరాణి యథావిధిగా గతంలో విధులు నిర్వహిస్తున్న ఉయ్యూరుకు వెళ్లారు.

